# హో... భూమన్



## శ్వేత పనితీరును ఎత్తిచూపిన చంద్రబాబు పర్యటన

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏప్రిల్‌లో తిరుమల వచ్చిన సందర్భంగా టిటిడి ప్రోటోకాల్ పాటించలేదని విమర్శలొచ్చాయి. ఆ రోజు టిటిడిపై వచ్చిన ఆరోపణలు...

1. ఉదయం దర్శనానికి వచ్చిన చంద్రబాబుకు తీర్థం, చటారి ఇవ్వలేదు.

2. తిరుమలకు వచ్చిన ఆయన్ను ముందు రోజు రాత్రి తిరుమల ప్రత్యేకాధికారి ధర్మారెడ్డి కలవలేదు. మరుసటి రోజు ఉదయం కూడా కలవలేదు.

3. ఇ.ఓ కూడా చంద్రబాబును కలవటానికి రాలేదు.

4. ఉదయం దర్శనం తర్వాత రంగనాయకుల మండపంలో ఆశీర్వాదం పొందడానికి కొద్ది సేపు ఎదురుచూసేలా చేశారు.

### ఎందుకు ఇలా జరిగింది....?

ప్రోటోకాల్‌లో లోటుకు కారణం ఎవరు? **ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేకంగా కల్పించుకుని ఇలా అవమానించమని చెప్పిందా?**

**పదవిలో లేక పోతే టిటిడిలో ఎవరికైనా ఇదే పరిస్థితా?** ఇవన్నీ అర్థం కావాలంటే అసలు ఆ రోజు ఏం జరిగిందో చూద్దాం....

### ఆ రోజు...

21వ తేదీ ఉదయం అర్చనానంతర దర్శనం తర్వాత చంద్రబాబు నాయుడు శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం చేసుకుని వెలుపలకు వస్తుంటే తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకురాలు తీర్థం, చటారి ఇవ్వని విషయాన్ని చంద్రబాబుకు చెప్పారు. అక్కడే ఆయన మనసు గాయపడింది.

ఆశీర్వాదం పొందేందుకు కొద్దిసేపు చంద్రబాబు రంగనాయక మండపంలో ఎదురుచూడాల్సి వచ్చింది. ఆశీర్వాదానికి టిక్కెట్టు తెచ్చుకున్న తర్వాత ఆలయ మర్యాదలతో ఆశీర్వాదం చేశారు.

ఈ రెండు సంఘటనల తర్వాత ఆలయం వెలుపలకు వచ్చిన బాబును తిరుమల ఆలయ డిప్యూటీ ఇ.ఓ సిద్దయ్య కలిశారు. చంద్రబాబు కాస్త అసహనంగా "ప్రోటోకాల్ పాటించటం తెలియదా?" అని అడిగి పాత్రికేయుల ముందుకు వెళ్లిపోయారు.

### తీర్థం, చటారి ఇవ్వక పోవటానికి కారణం?

దేవుడికి నైవేద్యం పూర్తి కానంత వరకు ఆలయంలో ఎవరికీ తీర్థం, చటారి ఇవ్వరు. చంద్రబాబు దర్శనానికి వచ్చేటప్పటికి శ్రీవారికి నైవేద్యం జరగలేదు. అందువల్ల ఆయనకు తీర్థం చటారి ఇవ్వలేదు.

### ఆశీర్వాదానికి ఎందుకు ఆలస్యం..!

రంగనాయక మండపంలో ఆశీర్వాదం ఇవ్వటానికి ఆలస్యం కావటానికి కారణం, చంద్రబాబు నాయుడు ఆశీర్వాదానికి టిక్కెట్టు కొనుగోలు చేయకపోవటం.

సాధారణంగా టిటిడి రూల్స్ ప్రకారం ఆరు మందికి మాత్రమే టిటిడి ఎలాంటి టిక్కెట్టు తీసుకోకుండా ఆలయ మర్యాదలను అందిస్తుంది. వారు దేశ రాష్ట్రపతి, ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మాత్రమే. రాష్ట్ర ప్రతిపక్ష నేతకు ఆలయ మర్యాదలు అందివ్వాలంటే టిక్కెట్టు తీసుకోవాలి. అయితే ఎలాంటి టిక్కెట్టు లేకుండా చంద్రబాబు ఆశీర్వాదంకు వచ్చారు.

### నాలుగు సంవత్సరాలు ఎలా ఆశీర్వాదం చేశారు...?

చంద్రబాబు నాయుడు నాలుగు సంవత్సరాలుగా ప్రతిపక్ష నేతగా వున్నారు. అప్పుడంతా రాని ప్రోటోకాల్ సమస్య ఈ సారి మాత్రం ఎందుకు వచ్చినట్టు?

కారణం ఒక్కటే...

అప్పట్లో ఆలయ డిప్యూటీ ఇ.ఓగా ప్రభాకర్‌రెడ్డి వున్నారు.

ఇప్పుడు కొత్త డిప్యూటీ ఇ.ఓ సిద్దయ్య వున్నారు.

ప్రభాకర్‌రెడ్డి పేష్కార్‌గా వున్నప్పటి నుంచి సుమారు 12 సంవత్సరాలు ఆలయ పాలనలోనే వున్నారు.

విశ్వసనీయ వర్గాల సమాచారాన్ని బట్టి గత నాలుగు సంవత్సరాలుగా చంద్రబాబు ఎప్పుడు తిరుమలకు వచ్చినా ఆలయంలోని ఓ అధికారే ఆశీర్వాదం టిక్కెట్టు సొంత డబ్బుతో కొనుగోలు చేసేవారు. దీంతో ఈ విషయంలో ఏ రోజూ సమస్య రాలేదు.

అయితే ఇప్పుడు కొత్తగా బాధ్యతలు తీసుకున్న వారికి ఏ పని ఎలా చేయాలో తెలియలేదు. దీంతో విమర్శలు వచ్చాయి.

### శ్వేత ఏం చేస్తున్నట్టు...!

చంద్రబాబు పర్యటన వల్ల టిటిడి ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే శ్వేత రెండు అంశాల్లో వెనుకబడినట్టు కన్పిస్తోంది. అవి...

1. టిటిడి అవసరాలకు తగ్గట్టు శిక్షణ లేక పోవటం

2. ఉద్యోగుల వ్యక్తి వికాసంలో వెనుకబాటు

### అవసరాలకు తగ్గ శిక్షణ

టిటిడిలో ప్రస్తుతం వ్యక్తులను బట్టి పాలన సాగుతోంది తప్ప, వ్యవస్థను బట్టి సాగటం లేదు. వేలాది సంవత్సరాలుగా తిరుమల ఆలయానికి వున్న ప్రత్యేకత ఏమంటే పాలన వ్యక్తులను బట్టి కాకుండా ఓ పద్దతిలో నడవటం.

అందుకే ప్రసాదాల తయారీకి ఏఏ దినుసులు ఎంత మోతాదులో వాడాలో పెద్దలు దిట్టం రాసి పెట్టారు. అలాగే ఉత్సవాల నిర్వహణ, నిత్య పూజలు ఇలా ఎన్నో అంశాలలో పద్ధతులను పెట్టారు.

వ్యక్తులు మారినా ఇబ్బందులు తలెత్తకుండా ఇలాంటి ఏర్పాటు అన్ని విషయాల్లోనూ చేశారు. అయితే ఇటీవల వ్యక్తులపై పాలన ఆధారపడటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఆదునిక అవసరాలకు తగ్గట్టు ఏ పరిస్థితిలో ఎలాంటి ఏర్పాట్లు చేయాలో నేర్పేవారు లేరు. ఇలా తెలియని తనం వల్లే చంద్రబాబు పర్యటన విషయంలో విమర్శలొచ్చాయి.

### కమ్యూనికేషన్ గ్యాప్

చంద్రబాబు పర్యటనను కావాలనే రాజకీయం చేశారని కొట్టి పారేయవచ్చు.

టిటిడి దృష్టిలో ఎవరైనా సరే తిరుమలకు వచ్చినపుడు వారి అతిథి. ఇంటికి ఓ అతిథి వచ్చే సమయానికి ఏదైనా లోటు జరిగితే ఏం చేస్తారు?

ఫలనా కారణంగా లోటు జరిగిందని 'కమ్యూనికేషన్‌తో' అతిథి మనసు నొప్పించకుండా చెబుతారు.

అదే పని చంద్రబాబు విషయంలో చేసి వుంటే సరిపోయేది. తిరుమలకు రాగానే ఏ సమయంలో దర్శనానికి వెళతారో తెల్సుకుని ఆశీర్వాదం టిక్కెట్టు గురించి చెప్పేసి వుంటే సరిపోయేది.

అలాగే తిరుమల జె.ఇ.ఓ, ఇ.ఓ ఎందుకు రాలేదో చంద్రబాబుకు వివరించి వుంటే సరిపోయేది. ఇ.ఓ బంధువులు స్వర్గస్తులు కావటం వల్ల ఆలయంలోకి రాకూడదని రాలేదు.

వసంతోత్సవంలో తిరుమల ప్రత్యేకాధికారి కంకణం కట్టుకోవటం, స్వామివారి వసంతోత్సవం జరుగుతుండటం వల్ల ఆయన అక్కడ వుండాల్సి రావటం వల్ల చంద్రబాబును ఆహ్వానించటానికి రాలేదు.

దేవుడికి ఆరగింపు జరిగే వరకు తీర్థ ప్రసాదాలు ఇవ్వలేము. తీర్థం ఇవ్వరు ఏమీ అనుకోవద్దని ముందే చెప్పి వుంటే ఏమైవుండేది?

చంద్రబాబు పర్యటనలో టిటిడి ఉద్యోగుల్లోని అవగాహనాలోపమే కాదు... కమ్యూనికేషన్‌లో కూడా లోపం వుందని స్పష్టంగా తెలిసివచ్చింది. తిరుమలకు వచ్చే వివిఐపిలకు కావాల్సిన ఏర్పాట్లు చూసుకునేందుకు టిటిడిలో ఓ.ఎస్.డి ఒకరు, ఆర్.ఓ - 1 వున్నారు. వీరు కాకుండా ఆలయ అధికారులు, పి.ఆర్.ఓ విభాగం కూడా వుంది. వీరంతా ఎందుకు ఏమీ చేయలేక పోయారు?

పి.ఆర్.ఓ విభాగం చంద్రబాబుకు సమాచారం ఇవ్వలేక పోవటం ఒక ఎత్తైతే... ఆ తర్వాత మీడియాకు కూడా సరైన వివరణ ఇవ్వలేదు.

వీరెవరూ కూడా తాము విధి నిర్వహణలో వైఫల్యం చెందామని ఇప్పటికి కూడా తెల్సుకుని వుండరు. ఎందుకంటే వీరు ఎప్పుడూ అందరి భక్తులతోనూ ఇలాగే వ్యవహరిస్తారు. అలవాటుతో వచ్చిన పొరపాటు ఇది.

వీరందరి శిక్షణకు బాధ్యత వహించే శ్వేత డైరెక్టర్ భూమన్ కూడా తన శిక్షణలోని లోటును గుర్తించి వుండరు. అదే టిటిడి...

**- కలియుగ నారద బ్యూరో**